క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

పూతలపట్టు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసన్న కుమారి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారమే సభ జరుగుతుందన్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు మాత్రమే సభకు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

నేత్రానందం..రథోత్సవం



రథోత్సవంలో స్వామివారు

చిత్తూరు రూరల్: శ్రీరామనవమి బ్రహోత్సవాలను పురస్కరించుకుని చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా స్వామికి ఉదయం అభిషేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ రథంలో స్వామిని ఆశీనులు చేసి ఊరేగించారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

రాసనపల్లెలో 100 లీటర్ల సారా స్వాధీనం



సారాను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుడిపాల: మండలంలోని రాసనపల్లెలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు దాడులు నిర్వహించారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ శివశంకర్‌రెడ్డి, ఎస్‌ఐలు శ్రీనివాసరావు, సుధాకర్‌రెడ్డి, రామ్మోహన్, రామాంజనేయులుతోపాటు సిబ్బంది రాసనపల్లెలో సారాపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 100 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న 2 వేల లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. రాసనపల్లెకు చెందిన జస్టిన్, సంపత్, అరుణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వారు తెలియజేశారు.

అలరించిన దుర్యోధన వధ



దుర్యోధన వధ ఘట్టంలో ఓ సన్నివేశం

గంగాధరనెల్లూరు: మండలం పరిధిలోని బాల గంగానపల్లిలో శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం ఆకట్టుకుంది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవ మూర్తులను అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో దుర్యోధన వధ ఘట్టం ఆహుతులను ఆకట్టుకుంది. దుర్యోధనున్ని గంగ మడుగు నుంచి భీముడు బయటకు రప్పించే సన్నివేశాన్ని కళాకారులు రక్తి కట్టించారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి విచ్చేసిన జనంతో సందడి నెలకొంది.

రూ.60 వేల నగదు సీజ్

ఐరాల : ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.60 వేల నగదును ఎస్‌ఐ రమేష్‌బాబు ఆదివారం సీజ్ చేశారు. మండలంలోని పాటూరు వద్ద వాహనాలను తనిఖీ నిర్వహిస్తుండగా తమిళనాడులోని రాణిపేటకు చెందిన కామరాజు బొలేరో నగదు తీసుకెళుతూ పట్టుబడ్డారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.



వాహనం తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

తవణంపల్లె: ఒడ్డుపల్లెలో దివ్యాంగుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న సునీల్‌కుమార్



చిత్తూరు: నరిగపల్లెలో ప్రచారం చేస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి, మేయర్ అముద



సీజనల్ నాయకుల మాటలు నమ్మొద్దు

- ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఆశీర్వదించండి
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి
- జగనన్న మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాల కొనసాగింపు
- పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల వేళ కనిపించే సీజనల్ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పాలనను ఓటుతో మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. నగరంలోని ఎల్‌బీపురం, నరిగపల్లె డివిజన్లలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికి, హారతులు ఇచ్చి విజయ తిలకం దిద్దారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలిసి ఫ్యాను గుర్తుకే ఓటేయాలని అభ్యర్థించారు. ఐదేళ్లుగా వలంటీర్లు నిస్వార్థంగా అందిస్తున్న సేవలను ఎన్నికల కోడ్ అడ్డు పెట్టుకుని చంద్రబాబు వృద్ధులకు, దివ్యాంగులకు తీవ్ర ద్రోహం చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు తీరుతో రాష్ట్రవ్యాప్తంగా 30 మందికి పైగా చనిపోయారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక అడుగడుగునా అడ్డుకోవడమే లక్ష్యంగా టీడీపీ కుట్రలు పన్నుతోందన్నారు. వీరికి మరోసారి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సంతపేటలో విజయానందరెడ్డి సతీమణి ఇందుమతి ప్రచారం నిర్వహించారు. ప్రజలు చూపుతున్న నమ్మకాన్ని ఓట్ల ద్వారా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, రూరల్ అధ్యక్షులు త్యాగ, కార్పొరేటర్లు, నాయకులు మధురెడ్డి, రేఖ, శోభ, అంజలిరెడ్డి, సయ్యద్, నారాయణ, అప్పాజీ, కిషోర్ యాదవ్, రమణ, హరి, నరేష్, శంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, ప్రేమ్‌కుమార్, రాజన్ బాబు, జాషువా, చిరంజీవి పాల్గొన్నారు.

డివిజన్ల వారీగా...

నగరంలోని డివిజన్ల వారీగా కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. వేలూరులో రోడ్డులో నాయకులు సంతోష్, సంజయ్‌గాంధీనగర్‌లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, 5వ డివిజన్ కార్పొరేటర్ హరిణిరెడ్డి, నాయకులు చాన్‌బాషా, చావడివీధిలో నాయకులు వెంకటేష్ ప్రచారం చేశారు.

బాబుకే గ్యారంటీ లేదు..

తవణంపల్లె: చంద్రబాబు జీవితానికే గ్యారంటీ లేదు కానీ ఆయన ప్రజలకు ష్యూరిటీ ఇస్తారట అంటూ వైఎస్సార్‌సీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని పల్లెచెరువు, మైలవారిపల్లె, జెట్టిపల్లె, కొంద్రాజుకాలువ, వెంగంపల్లె పంచాయతీల్లో ఆయన ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. అవ్వాతాతలు, మహిళలు, యువకులను ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. జగనన్న వస్తే మళ్లీ సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేస్తారని వివరించారు. చంద్రబాబు షూరిటీ పేరుతో ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు వచ్చారని చెప్పారు. చంద్రబాబు నెరవేరని హామీలిచ్చి ప్రజలను నట్టేట ముంచుతారని గుర్తుచేశారు. రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, ఫ్యాను గుర్తుకు ఓటేసి జగనన్నను మరో సారి గెలిపించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వజ్రాయుధంలాంటి ఓటును ఆలోచించి అభివృద్ధికి వేయాలని అభ్యర్థించారు. ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓట్లు ముద్రించి అఖండ మెజారిటీ గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, తవణంపల్లె మండల పార్టీ అధ్యక్షుడు హరిరెడ్డి, ఐరాల మండల పార్టీ అధ్యక్షుడు బుజ్జిరెడ్డి, పార్టీ నాయకులు మండల పార్టీ ఇన్‌చార్జి, పారిశ్రామికవేత్త ప్రకాష్‌రెడ్డి, గాంధీబాబు హరికృష్ణారెడ్డి, రవిరెడ్డి, సుజిత్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, తారకనాథరెడ్డి, అభిషేక్ రెడ్డి, వంశీరెడ్డి, తేజారెడ్డి, చిన్నారెడ్డి, శాంతిసాగర్ రెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, శరత్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మురుగన్, పరదేశి, చిట్టిబాబు, ఉమామహేశ్వర రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, సుధాకర్, మునిరెడ్డి, దిలీప్‌రెడ్డి, తుకారాంరెడ్డి, నేతాజీరెడ్డి, సతీష్‌రెడ్డి, గఫూర్‌సాహెబ్, జగ్గారెడ్డి, హరి, నాగరాజ, శ్రీనివాసులు, మునస్వామి, విద్యా, రాజశేఖర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, తేజారెడ్డి పాల్గొన్నారు.

నేడు నలిశెట్టిపల్లెలో ప్రచారం

మండలంలోని నలిశెట్టిపల్లె సచివాలయం పరిధిలోని తెల్లగుండ్లపల్లె, నలిశెట్టిపల్లె పంచాయతీల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు హరిరెడ్డి తెలిపారు. ప్రచారంలో పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొంటారని వివరించారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంస్థ ప్రతినిధులు, యూత్, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



చిత్తూరు: ప్రచారం చేస్తున్న ఇందుమతి



వేలూరు రోడ్డులో నాయకులు సంతోష్ ప్రచారం



సంజయ్‌గాంధీనగర్‌లో నాయకులు కృష్ణారెడ్డి, కార్పొరేటర్ హరిణిరెడ్డి ప్రచారం






తవణంపల్లె: దప్పువాయిద్యాలతో ప్రచారం, ఒడ్డుపల్లెలో ప్రచారం చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్, పార్టీ నాయకులు, మైలవారిపల్లెలో అవ్వాతాతలను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్, చిత్తూరు: చావడివీధిలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం

దూసుకుపోతున్న ఫ్యాన్

- ప్రచారానికి అనూహ్య స్పందన
- పూతలపట్టులో ముందుకు వెళ్లలేని స్థితిలో సైకిల్
- ప్రజలను నమ్మించేందుకు టీడీపీ ప్రచార పాట్లు
- కనుచూపుమేరలో లేని కాంగ్రెస్



ఇంటింటికీ వెళ్లి ఓటడుగుతున్న టీడీపీ నాయకులు, ఓటర్లతో మమేకమైన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ (ఫైల్)



కాణిపాకం: గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరుగులు తీస్తోంది. ప్రచారంలో ఫ్యాన్ గాలి గట్టిగా విస్తోంది. ఇందుకోసం వరుసగా నియోజకవర్గ, మండల, పంచాయతీ స్థాయి సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల్లోకి దూసుకెళుతోంది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్‌కు ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభిస్తోంది. ఆ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం ఈయన విజయానికి సానుకూలంగా మారింది. ఎన్నికల్లో కూడా ఆపార్టీ పథకాలనే ప్రచార అస్త్రాలుగా మార్చింది. ప్రజలు అడుగడుగునా నీరాజనం పడుతుండడంతో విజయానికి చేరువవుతోందన్న చర్చ ప్రజల్లో మొదలైంది. అయితే టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ఆ పార్టీ ప్రచారం చతికిలపడుతోంది. ప్రచారంలో సైకిల్ పరుగు పెట్టలేకపోతోంది. ప్రజలను నమ్మించేందుకు టీడీపీ శ్రేణులు నానా అగచాట్లు పడుతున్నారు.

పూతలపట్టు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరందుకుంటోంది. పూతలపట్టు, తవణంపల్లె, యాదమరి, ఐరాల, బంగారుపాళెం మండలాల్లో ప్రచారం ఊపందుకుంటోంది. ఇక్కడ ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు పోటీకి దిగుతున్నట్లు ఆయా పార్టీలు ప్రకటించాయి. కానీ ఇప్పటివరకు వైఎస్సార్ సీపీ, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు నామినేషన్ వేశారు. ప్రచారంలో మాత్రం మొదటి స్థానంలో వైఎస్సార్‌సీపీ ఉండగా, రెండో స్థానంలో టీడీపీ ఉంది. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు ఇంకా ప్రచార పర్వంలోకి దిగలేదు.

ప్రచారంలో దూకుడు

అధికార పార్టీ అయిన వైఎస్సార్ సీపీ నాయకులు మాత్రం ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు అమలు చేసిన పథకాలను వెల్లడిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఆ పార్టీ శ్రేణులతో పాటు అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. నియోజకవర్గం నుంచి మరోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించే వ్యూహంతో ఆ పార్టీ ముందుకెళుతోంది. వైఎస్సార్‌సీపీ ఎప్పటికప్పుడు నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాలను నిర్వహిస్తూ ఆ పార్టీ ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళుతోంది. ప్రతి గ్రామానికి అభ్యర్థులు వెళ్తున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతున్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని వివరిస్తున్నారు. ప్రతిపక్షాల తీరును ఎండగడుతున్నారు. అభివృద్ధి, సంక్షేమం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, మరోసారి ఆయన్ను గెలిపించుకుందామని పిలుపునిస్తున్నారు. అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. బొట్టుపెట్టి, మంగళహారతులతో స్వాగతం పలుకుతున్నారు. ర్యాలీల్లో నృత్యాలు చేస్తూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు.

ప్రచారంలో వెనుకబడిన టీడీపీ

ప్రచారంలో తెలుగుదేశం పార్టీ వెనుకపడుతోంది. గతంలో ఈ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడమే ఈ వెనుకబాటుకు కారణం. అదే సమయంలో ఆ పార్టీ అధినేత రోజుకో హామీ ఇవ్వడం, ప్రస్తుత సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, మరో రెండు పార్టీలతో పొత్తు పెట్టుకోవడం, ఆ పార్టీలకు ప్రజల్లో ఆదరణ లేకపోవడం తదితర కారణాలతో ఆ పార్టీ క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అయితే పత్రికల ద్వారా ప్రజల మద్దతు కూడగట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. తమకు ఆదరణ ఉందని చాటుకోవడానికి రకరకాలుగా ప్రయత్నిస్తూ, అధికార పార్టీకి గట్టి పోటీ ఇస్తామని చెప్పుకుంటోంది. ఆ పార్టీకి ప్రచారం చేసుకోవడానికి కూడా పెద్దగా అస్త్రాలు ఏమీ లేకపోవడంతో నాయకులు ప్రజల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోంది.

పత్తాలేని కాంగ్రెస్

ఇటీవల కాంగ్రెస్ పార్టీ పూతలపట్టు నియోజకవర్గానికి తమ అభ్యర్థిని ప్రకటించింది. గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఫ్యాను గుర్తుపై గెలిచిన ఎంఎస్ బాబును ఆ పార్టీ ప్రకటించడం గమనార్హం. అయితే నియోజకవర్గ ప్రజల్లో ఆయనపై తీవ్రంగా వ్యతిరేకత ఉండడంతో వైఎస్సార్ సీపీ ఈ సారి ఆయన్ను పక్కన పెట్టింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి టికెట్ తెచ్చుకున్నారు. అయితే ప్రచారం ఎలా చేయాలో, ప్రజల్లోకి ఏ ముఖం పెట్టుకుని వెళ్లాలో దిక్కుతోచక ఇంట్లోనే కూచున్నారు. ఆ పార్టీకి నియోజకవర్గంలో కేడర్ లేకపోవడంతో అసలు ఆ పార్టీ పోటీలో ఉందా లేదా అన్న విషయం కూడా ప్రజలకు తెలియడం లేదు.

నేడు గొల్లమడుగులో ఎన్నికల ప్రచారం

గుడిపాల: మండలంలోని గొల్లమడుగు పంచాయతీలో సోమవారం ఉదయం 7గంటలకు చిత్తూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్ తెలిపారు. దీనికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

ప్రదోషకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు


వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శివుడికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశునికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం నందీశ్వరునికి పాలు, పెరుగు, పుసుపు, కుంకుమ, విబూధితో అభిషేకించి పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.




నాడు: వేరుశనగ విత్తనాల కోసం బంగారుపాళెంలో క్యూలో నిల్చున్న రైతులు

నాడు బారులు.. నేడు ముంగిట్లో సేవలు

బంగారుపాళెం: గత ప్రభుత్వ హయాంలో పంట సాగు చేయాలంటే విత్త నుంచి విక్రయం వరకు రైతులు నానా అగచాట్లు పడేవారు. విత్తనాలు, ఎరువులు, మందులు కావాలంటే వ్యయప్రయాసలకు ఓర్చి మండల కేంద్రాలు, పట్టణాలకు వెళ్లి రోజుల తరబడి క్యూలో నిల్చుని తెచ్చుకునే పరిస్థితులు. నేడు అటువంటి పరిస్థితులు లేవు. రైతన్నల కోసం ప్రస్తుత ప్రభుత్వం సేవలను వారి ముంగిట్లోకి తీసుకువచ్చింది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను నిర్మించింది. రైతన్నలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మందులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేస్తున్నారు. పంటల సాగుకు సంబంధించిన సూచనలు, సలహాలను రైతుల పొలాల వద్దకే వెళ్లి వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు.





నేడు: రైతు భరోసా కేంద్రం వద్ద వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, పొలాల వద్ద రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

సర్పంచ్‌కి విజయానందరెడ్డి పరామర్శ

గుడిపాల: మండలంలోని గొల్లమడుగు సర్పంచ్ వెంకిరెడ్డి(బాబురెడ్డి) రెండురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన కాళ్లకు గాయాలయ్యాయి. దీంతో చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి ఆదివారం ఆయన్ను పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందని అడిగి తెలుసుకున్నాడు. ఆరోగ్యంపై జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.



సర్పంచ్ వెంకిరెడ్డిని పరామర్శిస్తున్న విజయానందరెడ్డి

మెగా ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పుత్తూరు: ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం గట్టు గ్రామంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మిత ఆహారం, క్రమం తప్పని వ్యాయామం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సూచించారు. 40 ఏళ్లు వచ్చిన ప్రతి ఒక్కరూ ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేసుకుని, తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ విధిగా 45 నిమిషాల పాటు నడవాలని సూచించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలందించడానికి తరలివచ్చిన తిరుపతి వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో 260 మందికి చికిత్స నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు ఏ.ఆర్ముగం, జె.శ్రీధర్‌రాజు, కె.సుభాషిణి, సరేంద్ర, శ్రీహరినాయుడు, ప్రణీత్, శ్రీపతి, నరసింహులు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గోపీకృష్ణ, యుగంధర్‌రాజు, మాధవులనాయుడు, కుప్పయ్య, గుణశేఖర్‌రెడ్డి, గట్టుమోహన్, శివ, రామచంద్రనాయుడు, నారాయణ పాల్గొన్నారు.



శిబిరంలో చికిత్స నిర్వహిస్తున్న డాక్టర్లు